క్లుప్తంగా

ప్రతిఒక్కరూ భక్తితో ఉండాలి



ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు

పూడూరు: ప్రతిఒక్కరూ దైవ భక్తి కలిగి ఉన్నప్పుడే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తారని సినిమా సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేషపటేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సోమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని సూచించారు. సోమేశ్వర స్వామికి రుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సుభాన్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ముఖ్యం



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

దోమ: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని షీటీం ఇన్‌చార్జి నర్సింహులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కేజీబీవీలో ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు పాఠశాల ఎస్‌ఓ చైతన్య ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలపై జరుగుతున్న నేరాలు, బాల్య వివాహాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మహిళలపై ఎలాంటి సంఘటనలు జరిగిన 181కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ భీంరెడ్డి, షీటీం సభ్యులు మనీషా, శోభరాణి అధ్యాపకులు, విద్యార్థులు, కళాజాతబృందం తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవలకు గుర్తింపు



ఆలయ ఈఓ సుధాకర్‌ను సన్మానిస్తున్న నాయకులు

కుల్కచర్ల: నిస్వార్థమైన సేవలకు ఎక్కడికెళ్లినా గుర్తింపు, గౌరవం లభిస్తుందని పాంబండ ఆలయ మాజీ చైర్మన్ రాములు అన్నారు. ఈ నెల 4న ఆలయ ఈఓ సుధాకర్ గాడ్‌సన్ స్పిరిట్ మినిస్ట్రీస్, గాడ్‌సన్ థియోలాజికల్ అకాడమీ ఆధ్వర్యంలో డాక్టరేట్ తీసుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆయనను ఆలయ గత పాలకవర్గం స్థానిక నాయకులతో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో సంజీవ్, ఎల్లయ్య, వెంకట్రాములు, స్థానిక యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం



అబుల్ కలాం ఆజాద్ చిత్రపటం వద్ద గురునాథ్‌రెడ్డి

దుద్యాల్: మండల పరిధిలోని చిలుముల మైల్వార్ గ్రామంలో ఉన్న మైనార్టీ గురుకుల పాఠశాలలో జాతీయ విద్యా దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఆర్.గురునాథ్ రెడ్డి హాజరై మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొడంగల్ ఎంఈఓ రాంరెడ్డి, ప్రిన్సిపాల్ రాఘవేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటు



కుల్కచర్ల: గ్రామాల్లో మౌలిక సదుపాయల కల్పనకు ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని ఘణపూర్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం గ్రామంలో ఎమ్మెల్యే నిధులతో మంజూరైన హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు బచ్చిరెడ్డి, రాములు, వెంకటేష్, అంబయ్య, నర్సింలు, చిన్నయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌పై దాడి హేయమైన చర్య

- నిందితులను శిక్షించాలి
- విధులు బహిష్కరించిన ప్రభుత్వ ఉద్యోగులు



పరిగి: తహసీల్దార్ కార్యాలయం ఎదుట..



తాండూరు రూరల్: తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

తాండూరు రూరల్: ఫార్మాసిటీ భూసేకరణలో ప్రజాభిప్రాయం కోసం వెళ్లిన అధికారులకు చేదు అనుభవం ఎదురైంది. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, సబ్‌కలెక్టరు, కడా అధికారి, డీఎస్పీ, ఇతర అధికారులపై రైతులు దాడి చేశారు. దీనిని వ్యతిరేకిస్తూ తాండూరు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది విధులు బహిష్కరించింది. సోమవారం కార్యాలయానికి తాళం వేశారు. కలెక్టర్‌పై దాడి చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

నిరవధిక సమ్మె

పరిగి: లగచర్లలో జిల్లా కలెక్టర్, కడా అధికారులపై దాడికి నిరసనగా పరిగి తహసీల్దార్ కార్యాలయంలో మధ్యాహ్నం నుంచి అధికారులు నిరవధిక సమ్మె నిర్వహించారు. అధికారులపై ప్రజలు దాడులు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వ సూచనల మేరకే అధికారులు ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చారని దాడులు చేయడం ఎంతవరకు సమంజసమని ఆవేదన వ్యక్తం చేశారు.

పెద్దేముల్‌లో..

పెద్దేముల్: కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో పాటు అధికారులపై గ్రామస్తులు దాడి చేయడాన్ని ఖండిస్తూ పెద్దేముల్ మండల రెవెన్యూ అధికారులు విధులు బహిష్కరించారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్‌ప్రసాద్, ఆర్‌ఐ సైదులు సిబ్బంది పాల్గొన్నారు.

విధుల బహిష్కరణ

ధారూరు: కలెక్టర్ ప్రతీక్‌జైన్, కడా అధికారి వెంకట్‌రెడ్డి, ఇతర అధికారులపై దాడికి నిరసనగా ధారూరు మండల తహసీల్దార్ సాజిదాబేగం ఆధ్వర్యంలో సిబ్బంది విధులను బహిష్కరించి ధర్నా నిర్వహించారు. దాడికి పాల్పడ్డ వారిని కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు.

తాళం వేసిన సిబ్బంది

యాలాల: జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌పై గ్రామస్తుల దాడికి వ్యతిరేకంగా యాలాల రెవెన్యూ అధికారులు నిరసన వ్యక్తం చేశారు. కార్యాలయానికి తాళం వేసి విధులను బహిష్కరించారు. తహసీల్దార్ అంజయ్య మాట్లాడుతూ.. అధికారులపై దాడులు చేయడం అత్యంత హేయమైన చర్యగా అభివర్ణించారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: కలెక్టర్, ఇతర అధికారులపై లగచర్లలో దాడికి పాల్పడటాన్ని నిరసిస్తూ మండల రెవెన్యూ అధికారులు నిరసన వ్యక్తం చేశారు. కుల్కచర్ల తహసీల్దార్ మురళీధర్ ఆధ్వర్యంలో కార్యాలయాన్ని మూసి వేసి ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిరసన

మోమిన్‌పేట: కలెక్టర్, జిల్లా అధికారులపై దాడికి వ్యతిరేకంగా సోమవారం మధ్యాహ్నం మోమిన్‌పేట తహసీల్దార్ కార్యాలయానికి సిబ్బంది తాళం వేసి నిరసన తెలిపారు.



కుల్కచర్ల: తహసీల్దార్ కార్యాలయం ఎదుట..

రైతులకు అండగా ఉంటాం

తాండూరు రూరల్: లగచర్ల రైతులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని ఆ పార్టీ తాండూరు మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఫార్మా కంపెనీ పేరుతో రైతుల నుంచి ప్రభుత్వం అన్యాయంగా భూములు తీసుకుంటుందని ఆరోపించారు. కంపెనీల పేరుతో భూములు దౌర్జన్యంగా తీసుకోవాలనుకుంటే రైతుల ఆగ్రహం చూడక తప్పదన్నారు. కలెక్టర్‌కు సరైన భద్రత సైతం ఇవ్వకపోవడం ఏంటని ప్రశ్నించారు.

దాడిని ఖండిస్తున్నాం

కొడంగల్ రూరల్: ఫార్మా విలేజ్ భూసేకరణపై చర్చించేందుకు వెళ్లిన అధికారులపై దాడులకు పాల్పడడం సరైందికాదని కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసనలు తెలిపారు. సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తూ పరిష్కరించుకునే క్రమంలో దాడులకు పాల్పడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, యూసుఫ్, కృష్ణంరాజు, నయీమ్, శంకర్‌నాయక్, సంతోష్, సాయిరెడ్డి, తార్యానాయక్, రెడ్యానాయక్, భీమరాజు, అశ్వక్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా అధికార యంత్రాంగంపై జరిగిన దాడులను పీఆర్‌టీయూ మండల శాఖ తీవ్రంగా ఖండిస్తుందని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అబ్దుల్‌హఖ్, దినేష్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు.

దాడులు సరికావు

దౌల్తాబాద్: కలెక్టరు ప్రతీక్‌జైన్, సబ్‌కలెక్టరు, కడా అధికారి, డీఎస్పీపై దాడిచేయడం హేయమైన చర్య అని కాంగ్రెస్ మండల నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీఎంపీపీ విజయ్‌కుమార్, నాయకులు వీరయ్య, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేతల ఖండన

యాలాల: కలెక్టర్‌పై జరిగిన దాడి ఘటన అత్యంత హేయమైన చర్య అని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, సంగెంకుర్దు మాజీ సర్పంచ్ కోలుకుంది హన్మంతు, సీనియర్ నాయకుడు మహిపాల్ ఒక సంయుక్త ప్రకటనలో ఖండించారు.

కాంగ్రెస్ నేతల మండిపాటు

బొంరాస్‌పేట: లగచర్లలో అభిప్రాయ సేకరణకు వెళ్లిన జిల్లా కలెక్టర్, ఇతర అధికారులపై ఫార్మా రైతులు భౌతిక దాడులకు పాల్పడిన ఘటనను కాంగ్రెస్ నాయకులు ఖండించారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, పీఏసీఎస్ మండలాధ్యక్షుడు జయకృష్ణ, పార్టీ మండలాధ్యక్షుడు నర్సింలు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కొడంగల్ రూరల్: అంబేద్కర్ చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించిన కాంగ్రెస్ శ్రేణులు



బొంరాస్‌పేట: సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు



మోమిన్‌పేటలో..



ధారూరు: రెవెన్యూ కార్యాలయం ఎదుట..



యాలాలలో..



పెద్దేముల్: కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న రెవెన్యూ అధికారులు

రోడ్డు విస్తరణ చేపట్టండి



మన్నెగూడలో మాట్లాడుతున్న సమితి సభ్యులు

బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్

పూడూరు: జిల్లా గుండా పోతున్న 163 జాతీయ రహదారిని అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ చౌరస్తా వరకు ఆరులైన్ల రోడ్డు వేయడంలో జాప్యం ఎందుకు చేస్తున్నారని బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్ ప్రశ్నించారు. సోమవారం మండల పరిధిలోని మన్నెగూడలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రోడ్డుపై ఏడాదిలో 380 ప్రమాదాలు జరగగా 140 మంది ప్రాణాలు కోల్పోయన్నారు. రూ.950 కోట్ల టెండర్ వేసి మూడేళ్లు గడుస్తున్నా కాంట్రాక్టర్ పనులు ఎందుకు చేయడం లేదన్నారు. గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతి ఇచ్చినా పనులు జరగడం లేదన్నారు. 15 రోజుల్లో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జాతీయ రహదారి సాధన సమితి ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ మల్లేశం, మాజీ సర్పంచ్‌లు వినోద్‌గౌడ్, రామస్వామి, నాయకులు దేవయ్య, రాజేందర్, జాహెద్, దయానంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ డబ్బులు అందించాలి

కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు కాంగ్రెస్ నాయకుల వినతి

బొంరాస్‌పేట: పంట రుణమాఫీలో బ్యాంకుల సతాయింపులు, కాలయాపనలు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింలునాయుడు అన్నారు. ఈమేరకు సోమవారం కడా కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు వినతిపత్రం అందజేశారు. బ్యాంకులు రుణమాఫీ డబ్బులను రైతులకు సకాలంలో అందించలేకపోతున్నాయని పేర్కొన్నారు. సంబంధిత బ్యాంకు మేనేజర్లను విచారించి రైతులకు వెంటనే రుణమాఫీ డబ్బులు ఖాతాల్లో నుంచి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పంటల దిగుబడులే చేతికొచ్చినా రుణమాఫీ డబ్బులు అందించడంలో బ్యాంకులు విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

దోమ: సీఎం సహాయనిధి పేదలకు వరంలాంటిదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు అన్నారు. సోమవారం మండల పరిధిలోని బొంపల్లి గ్రామానికి చెందిన ఆఫ్రిన్‌బేగం అనారోగ్యానికి గురవ్వగా స్థానిక నేతలు ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఎమ్మెల్యే సీఎంఆర్‌ఎఫ్ కింద ఆస్పత్రి ఖర్చులకై న నిధులను మంజూరు చేశారు. సంబంధిత చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నేతలు అంతిరెడ్డి, చంద్రశేఖర్, రాములు, ఖలీం, బషీర్, భాస్కర్, ఇంతియాజ్, ప్రభాకర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్

పరిగి: క్రీడలతో మానసిక ఉల్లాసం పెంపొందుతుందని పరిగి మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్ అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని మినీ స్టేడియంలో అండర్ 17 క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడాల్లో రాణించాలని సూచించారు. క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని ప్రభుత్వం కూడా ప్రత్యేక నిధులు కేటాయించి ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ గోపాల్, నాయకులు కృష్ణ, వెంకటేష్, పీఈటీ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం నంబర్ వన్ ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. నాణ్యతతో కూడిన భోజనాన్ని అందించడంతో విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. విద్యాభివృద్ధికి ఎల్లప్పుడు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



వంట పాత్రను పరిశీలిస్తున్న చైర్మన్ తదితరులు

అందని ద్రాక్షలా.. సాంకేతిక విద్య

నేటి ఆధునిక ప్రపంచంలో సాంకేతిక విద్య అధిక ప్రాధాన్యం సంతరించుకుంది. గ్రామీణ పేద విద్యార్థులు సైతం పోటీ ప్రపంచానికి సన్నద్ధం అయ్యేందుకు వీలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సర్కారు పాఠశాలల్లో కంప్యూటర్ విద్యకు శ్రీకారం చుట్టాయి. కానీ క్షేత్రస్థాయిలో సరైన పరికరాలు, సిబ్బంది లేక సాంకేతిక విద్య కలగానే మారింది.

- ప్రభుత్వ బడుల్లో నిరుపయోగంగా కంప్యూటర్లు
- నష్టపోతున్న గ్రామీణ విద్యార్థులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



దౌల్తాబాద్ జెడ్పీ పాఠశాలలో మూలనపడ్డ కంప్యూటర్లు

దౌల్తాబాద్: ప్రభుత్వం విద్యావ్యవస్థను గాడిలో పెట్టేందుకు వివిధ కార్యక్రమాలు అమలు చేస్తుంది. ఇటీవల మండలంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసింది. ఎన్నో ఏళ్లుగా ఖాళీగా ఉన్న ఎంఈఓ పోస్టును నియమించింది. కానీ పాఠశాలల్లో నిరుపయోగంగా ఉన్న కంప్యూటర్లు ఉపయోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టలేదు. రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన సాంకేతిక పరికరాలు ఎందుకు పనికి రాకుండా పడి ఉన్నాయి. దీంతో గ్రామీణ విద్యార్థులకు కంప్యూటర్ విద్యాబోధన అందని ద్రాక్షగా మారింది.

తుప్పు పడుతున్నాయి..

మండలంలో ఉన్నత పాఠశాలల్లో గతంలో మంజూరు చేసిన కంప్యూటర్లు తుప్పు పట్టిపోతున్నాయి. కొన్ని పాఠశాలల్లో కంప్యూటర్లు మాయమయ్యాయి. పాఠశాలల్లో సాంకేతిక విద్యను బోధించే వారు లేకపోవడంతో విద్యార్థులు నష్ట పోతున్నారు. ప్రభుత్వం ప్రైవేట్‌కు ధీటుగా సర్కారు పాఠశాలల్లో అన్ని విధాల బోధన సౌకర్యం కల్పించాలన్నా ఉద్దేశంతో కంప్యూటర్ విద్యను ప్రవేశపెట్టింది. రూ.లక్షలు వెచ్చించి కంప్యూటర్లు మంజూరు చేసింది. వాటికి కావాల్సిన పరికరాలను అందించింది. కానీ అమలు చేయడంలో ప్రభుత్వ అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైంది.

అలంకారప్రాయంగా కంప్యూటర్లు

దౌల్తాబాద్, చల్లాపూర్, గోకఫసల్‌వాద్‌లోని ఉన్నత పాఠశాలల్లో, నీటూరు ప్రాథమికోన్నత పాఠశాలలకు మంజూరు చేసిన కంప్యూటర్లు అలంకారప్రాయంగా మారాయి. దీంతో విద్యార్థులు సాంకేతిక విద్యకు దూరమవుతున్నారు. అప్పట్లో కంప్యూటర్ విద్యను నేర్పడానికి సిబ్బందిని కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించారు. వారు నాలుగేళ్లు చిన్నారులకు సాంకేతిక విద్యపై అవగాహన కల్పించారు. అనంతరం వారిని తొలగించారు. పాఠశాలల్లో కంప్యూటర్లు మంజూరు చేయడమే తమవంతు అనుకున్న అధికారులు బోధించే వారిని నియమించలేదు. ఒక్కో పాఠశాలకు 8 నుంచి 10 కంప్యూటర్లు మంజూరు చేసింది. వీటిని ఉపయోగంలోకి తేవాలన్నా చిత్తశుద్ధి లేకపోవడంతో ప్రైవేటు బడులకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తయారు చేద్దామన్నా ఆశయం నీరుగారిపోతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో కంప్యూటర్ విద్యను అందించేందుకు కృషి చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

సాంకేతిక విద్య అవసరం



విద్యార్థులకు కంప్యూటర్ విద్య అవసరం. నేను ఇటీవలే ఎంఈఓగా బాధ్యతలు తీసుకున్నా. అప్పట్లో కొన్ని పాఠశాలలకు కంప్యూటర్లు మంజూరయ్యాయి. అవి నిరుపయోగంగా ఉన్న మాట వాస్తవమే. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తా.

– వెంకట్‌స్వామి, ఎంఈఓ, దౌల్తాబాద్

శివాలయాల్లో ప్రత్యేక పూజలు



మహాదేవుని ఆలయంలో దీపారాధన

కొడంగల్ రూరల్: పట్టణంలోని మహాదేవుని ఆలయం, గాడిబాయి శివాలయం, బసవేశ్వర ఆలయాలలో కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని శివలింగానికి పంచామృతంతో అభిషేకం, విశేష అలంకరణతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీమహాదేవుని ఆలయంలో దేశ్‌ముఖ్ కుటుంబసభ్యులు ఉదయం స్వామివారికి అభిషేకం, అష్టోత్తర శతనామావళితో పూజలు నిర్వహించారు.

ప్రజావాణికి దరఖాస్తులు నిల్

మోమిన్‌పేట: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి దరఖాస్తులు రాలేవని ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర కులగణనలో గ్రామ ప్రజలు, నిత్యం వ్యవసాయ పనులలో నిమగ్నం కావడంతో ప్రజావాణికి అర్జీలు రాలేవన్నారు. కార్యక్రమంలో పీఆర్‌ఏఈఈ ప్రవీణ్‌కుమార్, ఎంఈఓ మల్లేశం, మండల పశువైద్యాధికారి గీత, ఏపీఎం రాజు, ఏపీఓ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ రైతులను వినియోగించుకోండి

బొంరాస్‌పేట: వ్యవసాయ శాఖకు ఇది వరకు చేదోడువాదోడుగా సేవలందించిన రైతులను తిరిగి విధుల్లో వినియోగించుకోవాలని ఆదర్శ రైతుల సంఘం నాయకులు కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఆదర్శ రైతుల సంఘం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఏఈఓలకు అనుసంధానంగా విధులు నిర్వహించే అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. దీనికి సంబంధించి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నర్సిములు, రామకృష్ణారెడ్డి, నర్సిరెడ్డి, మొగులయ్యగౌడ్, వెంకట్రాములు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా సమగ్ర సర్వే

దౌల్తాబాద్: మండలంలో సమగ్ర కుటుంబ సర్వే ముమ్మరంగా కొనసాగుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం దౌల్తాబాద్‌లో జరుగుతున్న ఇంటింటి సర్వేను ఆయన తనిఖీ చేశారు. ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటిని సందర్శించి యజమానులతో మాట్లాడి సమాధానం రాబట్టాలని పేర్కొన్నారు. ప్రజలు సైతం ఎన్యుమరేటర్లకు సహకరించాలని కోరారు.

తప్పులు లేకుండా చేయాలి

దోమ: సమగ్ర ఇంటింటి సర్వేను తప్పులు లేకుండా చేపట్టాలని ఎంపీడీఓ మహేశ్‌బాబు, ఎంఈఓ వెంకట్ సూచించారు. సోమవారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని పాలేపల్లి, బొంపల్లి, శివారెడ్డిపల్లి, బాసపల్లి, మోత్కుర్, తదితర గ్రామాలను వారు సందర్శించి ఎన్యుమరేటర్లు నిర్వహిస్తున్న సమగ్ర కుటంబ సర్వేను పరిశీలించి సలహాలు, సూచనలు ఇచ్చారు.

పార్టీకి పూర్వ వైభవం తెస్తాం

బంట్వారం: తెలుగు దేశం పార్టీకి పూర్వవైభవం ఖాయమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రొంపల్లి నర్సింలు అన్నారు. సోమవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి వికారాబాద్‌లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించి మాట్లాడారు. ప్రతి గ్రామంలో టీడీపీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం చేపడుతామన్నారు.